# ఊబి

జి.వెంకటకృష్ణ

బస్సునుంచీ దిగిన ఓ జనాల గుంపు.... బస్టాండు టీకొట్టుకాడి వాళ్లను యేదో వాకబు చేస్తోంది. ఆ గుంపులోనే యిద్దరు ఆడాళ్లు ఒక యువతిని రెండు రెక్కలూ పట్టుకొని నడిపిస్తున్నారు. ఆమె.... నిస్రాణంగా, తూలిపోతూ నడుస్తూ వుంది. ముందుగానే సన్నగా రివటలా వుంది చాలా బలహీనంగా కన్పిస్తోంది. చెదిరిపోయిన జుట్టూ, బొట్టు లేని నుదురూ, మాసిన ఎర్రని చీరా, గాజులు లేని చేతులకు గీరుకుపోయిన గుర్తులూ, చెప్పులు కూడా లేని కాళ్లూ, చూస్తే చాలా కాలంగా రోగంతో బాధపడుతున్న మనిషిలా వుంది. బాగా పరిశీలించి చూస్తే ముఖంలో తొందర తొందరగా మారిపోతున్న భావాల నీడలు కన్పిస్తాయి, తనలో తనే మాట్లాడుకుంటున్నట్లు పెదవులు వణుకుతూ కదులుతున్నాయి.

ఈ గుంపు చుట్టూ.... టీ కొట్టు కాడి జనాలు గుంపుగా చేరారు... ఏమైంది... ఏమైంది....యేవూరు అంటూ.....

"యేమయ్యిందన్నా పాపకు."

"దయ్యం పట్టిందన్నా."

"దైమా! అధ్వాన్నం చేసింది గదన్నా పాపను."

"తురకనా సాగితి పట్టిందప్పా నా బిడ్డకు, నేస్తురాళ్లాగా మా యింటికొచ్చి పోతా వుండా, మొగుడు హింస పెట్నాడని అది సచ్చి, పోతా పోతా వూరికే పోకుండా నా బిడ్డకు పట్టింది.... దీన్ని తీసకపోతా నంటాది.....యెవురెవురికో సూపిస్తిమి యిడసకపాయ ముండ" ఆమె తల్లి ఏడుస్తూ "యిప్పుడు యాడికి పోవాలమ్మా."

"హుస్సేనాపురం దర్గాకాడ దయ్యాలిడిపిస్తారంటనే.... ఆడికి పోతాండము" అంతవరకూ నిస్రాణంగా సోలిపోయిన ఆ అమ్మాయి.... ఒక్కసారిగా కదిలి తనను పట్టుకున్న వాళ్ళను విదిలించేసి... "ఓ హో హో హో" అంటూ మూల్గుతూ, మధ్య మధ్యలో ఉర్దూ మాటలు వదురుతూ.... జుట్టు పెరుక్కుంటూ, శరీరమంతా విచిత్రంగా మెలికలు తిప్పడంతో అది చూసి అక్కడున్న వాళ్లంతా నిజంగా ఆమె దయ్యం అన్నట్లుగా భయపడి చెదిరిపోయారు.

ఆమెను యిద్దరు మగవాళ్లు బలంగా పట్టుకున్నారు. అయినా ఆమె నీల్గుతూనే వుంది... ఏదేదో బాధాకరంగా వదురుతోంది.....

అంతలో అక్కడికి చేరిన ఓ మనిషి, విషయం తెలిసికొని, "హుస్సేనాపురం దర్గా దూరం అయితాది.... పక్కనే భైరాపురంలో మంత్రాల భైరవాచారి వున్నాడు, దయ్యాల్ని బాగా యిడిపిస్తాడు, ఆడికి పోదాం రాండి నేనూ పోతాండా" అంటూ వాళ్లను పురమాయించాడు.

ఆ అమ్మాయి పరిస్థితి అధ్వాన్నంగా వుండడంతో, దిక్కు తోచక అతన్ని అనుసరించింది గుంపు.

భైరవాచారిది, విశాలమై, రాటు దేలిన ముఖం.... నుదుట పెద్దబొట్టు, జుట్టు బాగా పెంచి జడలు కట్టించాడు, చేతికి కడియాలూ, మెడలో రుద్రాక్షమాలలూ వేసి, కాషాయవస్త్రాలు ధరించాడు, కళ్లు ఎర్రగా వుండి చూస్తూనే భయం కల్గిస్తున్నాడు....

ఆ రాత్రి, మంత్రాల ముగ్గు మీద ఆ అమ్మాయిని కూర్చోపెట్టి వేపమండలతో విసురుతూ, నిమ్మకాయలు కోసి తలమీద రుద్దుతూ, దట్టంగా సాంబ్రాణి పొగవేసి, వచ్చీరాని యేవేవో మంత్రాలు వల్లిస్తూ ఆమెను పూనకంలోకి తెచ్చాడు..... ఆ అమ్మాయి మామూలు కన్నా ఎక్కువగా వూగిపోతూ ".... తీసుకుపోతా...లేకుంజాతూ....నయ్ ఛో డేంగీ.....నా కిష్టం యిది....." అంటూ మెలికలు తిరిగి పోతా వుంది. భైరవాచారి తీవ్రస్థాయిలో అరుస్తూ భయపెడుతూ బెత్తంతో కొట్టడంతో ఆమె మరింత రెచ్చిపోవడం, భైరవాచారి బెల్టుతో బాదడం. ఆమె అరుస్తూ మీదకు రావడంతో.....

"దయ్యం చానా గట్టిది....."అంటూ నల్గురైదుగురు ఆమెను కట్టిపడేసి, చెప్పులతో విపరీతంగా కొడుతూ దిగిపో.....దిగిపో... అంటూ ఆ రాత్రి చాలా పొద్దు వరకూ అదే తంతు. చివరికి ఆమె "దిగిపోతా.... మార్ నక్కో... మార్ నక్కో..." అంటూ ఏడుస్తూ, అరుస్తూ నిస్రాణంగా పడిపోయింది.

మతాతీతమైన ఆమె స్నేహం - స్నేహితురాలి మరణానికి ఆమె పడిన వేదనా- పరిణామంగా 'స్కిజోఫ్రేనియా'గా ఆమె మారడం - వీళ్ళ మూర్ఖత్వం దానికి పెట్టిన పేరు దయ్యం! ఎవరు అర్థం చేసుకోగలరు. ఆమె బాధను. "పొద్దుటి కల్లా యిడిసిపోతుంది భయపడద్దండి..... చానా గట్టి దయ్యం.... నాగ్గా బట్టి యిడిసింది" విజయం సాధించినట్టు గర్వంగా నవ్వుతూ భైరవాచారి.

వుదయం ఎర్రెర్రగా తెల్లవారింది, నలిగిన ఎర్రచీరలో, గాయాలైన శరీరంతో ఎంతసేపటికీ లేవదు ఆమె.... తట్టి... తట్టి లేపుతున్నారు, కదలనైనా కదలదు.... బ్రతికుంటే కదా కదలదానికి !

"అయ్యో..... పాపా..." అంటూ ఆమెతో పాటు వచ్చిన గుంపు ఏడుస్తోంది... "దయ్యం సానా గట్టిది... పోతా పోతా... ప్రాణం తీసుకోపోయింది" తేల్చేసాడు భైరవాచారి.

'నువ్వు కొట్టిన దెబ్బలకే నా బిడ్డ సచ్చింది' అని యెవ్వరూ అనలేదు... బిడ్డ మరణం గూడా వాళ్ల కళ్లను తెరవదు.

ఆమె చావుకి కారణం దయ్యమా ?.... వీళ్ల మూర్ఖత్వమా ? అన్న ప్రశ్నకు సమాధానం ఎన్నడు కనుక్కోగలరు ?! ★